# ఓ తండ్రి కథ

ఎస్. నూర్ అహ్మద్



ఉదయం పది గంటలు కావొస్తున్నా టూటౌన్ స్టేషన్లో ఇంకా కదలిక వచ్చినట్లు లేదు. ఎక్కడో లోపలున్న రిమాండ్‌లో నుండి ఖైదీలు దగ్గుతున్న సవ్వడి తప్ప ఇంకే శబ్దమూ లేకుండా స్టేషన్ మౌన మునిలా నిలిచి వుంది. స్టేషన్లో నైట్ డ్యూటీ చేసిన పోలీసులు ఇళ్ళకు వెళ్ళిపోగా, డే డ్యూటీలోనివారు ఇంకా రాకపోవడంతో పోలీసుల బూట్ల శబ్దం కూడా అక్కడ కరువయింది.

ఆ సమయంలో స్టేషన్లో ఒక్కడే కూర్చొని ఏదో కేసుకు సంబంధించిన విషయాన్ని గురించి సీరియ స్‌గా రాసుకుంటున్నాడు హెడ్డు వీరాంజనేయులు.

అతని వయసు నలభై దాటిందని అతను వేసు కున్న చత్వారం అద్దాలు చెప్తున్నా, ఎంతగా ఎండలో తిరిగినా వ.సివాడని అతని ఎరుపు ఛాయ, గుబురు మీసాలు, భారీ ఆకారం దానికి తోడు కళ్ళలోని ఎరుపు జీరలు చూపరుల గుండెల్లో దడ పుట్టిస్తాయి...

నిశ్శబ్దంగా వున్న ఆ సమయంలో వున్నట్లుండి స్టేషన్ బయట కలకలం రేగడంతో స్టేషన్‌లోని కిటికీ గుండా బయటికి దృష్టి సారించాడు ఆంజ నేయులు.

బయట ఓ పది, పదిహేను మంది వ్యక్తులు ఒక యువకుడ్ని లోపలికి నెట్టుకుంటూ రావడం కనిపించగానే అప్పటిదాకా వున్న బాధేదో తీరినట్లు అతని ముఖం విప్పారింది.

కొద్ది క్షణాల్లోనే వారంతా హెడ్డు ముందుకు వచ్చారు.

"ఏం జరిగింది...?" పోలీసు దర్పంతో గంభీరంగా ప్రశ్నించాడు హెడ్డు ఆంజనేయులు. "సార్, వీడు రోడ్డున వెళ్ళే అమ్మాయిలను రోజూ ఏడిపిస్తూ, వారి వెంటపడి కారుకూతలు కూయడం, అమ్మాయి లకు ఎదురొచ్చి పొరపాటున చూడనట్లు నటించి ఢీకొట్టి వెకిలి చేష్టలు చేస్తుంటాడు' '

వారంతా ఒక్కొక్కరు ఒక్కో విధంగా ఈ విష యాన్నే చెప్పారు.

"ఇప్పుడేం జరిగిందో చెప్పవయ్యా".. ఇంతవరకూ ఏం జరగనట్లు చిరాగ్గా ప్రశ్నించాడు హెడ్డు.

"సార్ ఈ రోజు ఓ అమ్మాయి రోడ్లో వెళ్తుంటే వీడు వెళ్ళి ఆ అమ్మాయిని జబ్బ పట్టుకొని రోడ్డు పక్కన ఆపిన కార్లోకి లాక్కొని వెళ్ళబోయ్యాడు. రోజూ వీడి ఆగడాలు చూస్తున్న మేమంతా ఈ భాగోతం చూసి పరిగెత్తుకొని రాగానే కార్లో వున్న వీడి ఫ్రెండు కారుతో సహా ఉడాయించాడు. వీడు చేతికి చిక్కితే నాలుగు తగిలించి తెచ్చాం" వారిలో ఒకతను చెప్పాడు.

అంతా విని ప్రశ్నించాడు వీరాంజనేయులు.

''ఇంతకూ ఆ అమ్మాయి ఏదని....

ఆ మాట విని వచ్చిన వ్యక్తులంతా బిత్తరపోయి నీళ్ళు నములుతుంటే అది గమనించి చెప్పాడు.

"ఆ అమ్మాయి లేకపోతే ఈ కేస్ ఎలా వుంటుం దయ్యా! మీ వాలకం చూస్తే ఆమె అడ్రస్ కూడా తెలిసినట్లు లేదు... అందుకే మళ్ళీ వీడు ఈ జన్మలో ఇట్లాంటి లుచ్చా పని చేయకుండా నేను బుద్ధి చెప్పి పంపుతాగానీ, మీరు వెళ్ళండి" అన్నాడు.

ఆ తర్వాత ఆ వ్యక్తులు ఏదో గొణుక్కుంటూ వెళ్ళిపోగానే ఆ యువకుని వైపు తిరిగి "ఏరా, అమ్మాయిల్ని కిడ్నాప్ చేసేంత మొనగాడివా నువ్వు,, ఇక్కడే నీ పెళ్ళి చేసి కోర్టుకు పంపుతా. అక్కడ జైల్లో పెడుదువుగాని కాపురం" అన్నాడు వ్యంగ్యంగా.

ఈ మాటలకు ఆ యువకుడు బెదిరిపోకుండా బుద్ధిమంతుడిలాగా నోరు విప్పాడు.

"కోర్టు దాకా ఎందుకు సార్, చేసిన తప్పుకు ఎంత జరిమానా చెల్లించాలో చెప్పండి. అది మీకే కట్టుకుంటాను" అన్నాడతను.

ఆ మాట విని ఏదో చెప్పాలని ప్రయత్నించిన హెడ్డు నోరు, ఆ యువకుడు జేబులో నుండి తీసి టేబుల్‌పై పెట్టిన పచ్చ కాగితాలను చూడ గానే మూతపడింది.

దాంతో పాటే అతను ప్రసన్నుడయ్యాడు.

టేబుల్ మీది నోట్లను జేబులోకి తోసిన తర్వాత ఆ యువకుడిని పంపిస్తూ ఓ సలహా ఇచ్చాడు వీరాంజనేయులు.

"ఎవరైనా ఆ అమ్మాయి విషయం అడిగితే ఆమె నిన్ను ప్రేమించి, నీ వెంట రావడానికి సిద్ధపడిందనీ, అంతేగానీ కిడ్నాప్ చేయాలని ప్రయత్నించలేదనీ చెప్పు" అని.

ఆ తర్వాత ఆ యువకుడు స్వేచ్ఛగా బయటికి వెళ్ళిపోయాడు.

"అయినా ఈ ఆడపిల్లలు సరిగ్గా వుంటే మగ పిల్లలు ఎందుకు రెచ్చిపోతారు? వీళ్ళంతా రకర కాల డ్రస్సులేసి వళ్ళంతా కనిపిస్తున్నా టింగురంగా అని తిరుగుతుంటే ముసలోళ్ళకు అయినా మహా యిదిగా వుంటుంది. అలాంటప్పుడు తప్పు ఒక్కరిదే ఎలా అవుతుంది"

చేసిన తప్పును సమర్థించుకుంటూ మనసులోనే సమాధానపడ్డాడు హెడ్డు.

* * *

ఆ తర్వాత కొందరు కానిస్టేబుళ్ళు స్టేషన్ డ్యూటీలోకి రావడంతో వారిని అక్కడ వుండమని చెప్పి ఇంటికి వెళ్ళాడు వీరాంజనేయులు.

అయితే ఆ సమయంలో ఇంటి వాతావరణం గంభీరంగా వుంది.

అప్పటిదాకా ఇంట్లో నిశ్శబ్దంగా వున్న అతని భార్య అతన్ని చూడగానే గట్టిగా చెప్పడం మొదలుపెట్టింది.

"మీకు ఎన్నిసార్లు చెప్పినా విన్పించుకోరు, ఆడపి ల్లలకు అంతంత చదువులు వద్దండీ అని...! ఇప్పుడు చూడండి ఏమైందో, అది కాలేజీకి వెళ్తుంటే ఎవరో వెధవ వెధవ పనులు చేయబోయాడట.!"

ఇంకేదో చెప్పబోయిందామె.

ఆ మాట విని ఆవేశంతో అడ్డు తగిలాడు ఆంజనేయులు.

"ఎవడే వాడు బుద్ధిగా తలొంచుకొని కాలేజీకి వెళ్ళే నా కూతుర్ని అల్లరిపెట్టిన మొగోడు, నాయాల్ని నరికి పోగులు పెడ్తా" చిందులేసాడతను.

"వాడు రోజూ అమ్మాయిని అల్లరి పెట్టడమే కాదండీ, ఈ రోజు అమ్మాయిని ఎత్తుకెళ్ళాలని కారు తెచ్చాడంట. అది చూసి ఎవరో పుణ్యాత్ములు అమ్మాయిని కాపాడి వాడిని తెచ్చి 'మీ స్టేషన్' లోనే అప్పగించారంట. వాడ్ని నరుక్కుంటారో, సంపుకుంటారో మీ యిష్టంగానీ నేను మాత్రం రేపట్నుండి నా కూతుర్ని కాలేజీకి పంపను.. ''

వీరాంజనేయులు భార్య ఇంకేదో చెప్తోంది.

కానీ అది వినే స్థితిలో అతను లేదు.